లారీ టైర్ పేలడంతో బయటపడ్డ

ఇసుక వ్యాపారం

దీనివెనుక వైసీపీ బడా నేత ఉన్నట్లు ఆరోపణలు

గూడూరు నుంచి తమిళనాడుకు తరలిపోతున్న తెల్లబంగారం

చిత్తూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): లారీ టైరు పేలడంతో ఇసుక అక్రమ వ్యాపారం బయటపడింది. ఈ దందా వెనుక వైసీపీకి చెందిన బడా నేత ఉన్నట్లు ఆరోపణలొస్తున్నాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ మండలంలోని అనంతాపురం గ్రామం సమీపంలో మధ్యాహ్నం ఓ లారీ టైరు పేలి రోడ్డుపై ఆగింది. హెవీ లోడ్ కారణంగా డ్రైవర్ ఒక్కడే టైరు మార్చడానికి అవకాశం లేకపోయింది. చాలాసేపటి వరకు ఆ లారీ రోడ్డుపైనే ఆగి ఉంది. అనంతాపురం గ్రామానికి చెందిన కొందరు అటువైపు వెళుతుండగా లారీ నుంచి నీరు కారడాన్ని గమనించారు. దీనిపై బీఎన్ఆర్ పేట పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందన రాలేదు. దాంతో వారే లారీ ఎక్కి టార్పాలిన్ పట్టను తొలగించి చూస్తే ఇసుక కనిపించింది. దీన్ని వీడియో తీసి వాట్సాప్ గ్రూపులో వైరల్ చేశారు. తర్వాత బీఎన్ఆర్ పేట పోలీసులు రంగంలోకి దిగారు. తిరుపతి జిల్లా గూడూరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీని స్వాధీనం చేసుకుని బీఎన్ఆర్ పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే కేసు నమోదు చేయలేదు. విచారణలో ఈ దందా వెనుక గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన వైసీపీ బడా నేత ఉన్నట్లు గుర్తించారని తెలిసింది. గతంలోనూ గూడూరు నుంచి తమిళనాయుడుకు రవాణా అవుతున్న ఇసుక లారీని రెవెన్యూ, పోలీసులు పట్టుకుని, ఫైన్‌వేసి వదిలిపెట్టినట్లు సమాచారం.



ఇసుకను తరలిస్తున్న లారీ

టీడీపీ నాయకుడిపై హత్యాయత్నం

వైసీపీ వారి పనేనని బాధితుడి భార్య ఆరోపణ

కుటుంబానికి ప్రాణహాని ఉందని, కాపాడాలంటూ సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్‌కు వేడుకోలు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుడిపై హత్యాయత్నం జరిగింది. ఇది వైసీపీ వారి పనేనని ఆయన భార్య ఆరోపిస్తున్నారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. శ్రీరంగరాజపురం మండలం పిల్లారికుప్పం కాలనీకి చెందిన బాలయ్య కుమారుడు మునస్వామి గ్రామ కమిటీ టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం టీడీపీలోనే కొనసాగుతున్నారు. ఇతడికి అదే గ్రామానికి చెందిన కుప్పయ్య కుమారుడు, వైసీపీకి చెందిన జగన్నాథంకి మధ్య భూతగదా, పాత కక్షలున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం జగన్నాథం ఓ ట్రాక్టరు తీసుకొచ్చి మునస్వామి ఇంటి గేటును, ప్రహరీని ఢీకొట్టాడు. అంతటితో ఆగకుండా మునస్వామిని కూడా ట్రాక్టరుతో ఢీకొట్టి చంపే ప్రయత్నం చేశాడు. ఈ ఘటనలో మునస్వామికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్ఆర్‌పురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆస్పత్రిలో మునస్వామి భార్య అనసూయ మాట్లాడుతూ.. ఇది వైసీపీ వారి పనేనని ఆరోపించారు. తమ కుటుంబానికి వైసీపీ వారి ప్రాణహాని ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కాపాడాలని వేడుకున్నారు. గ్రామంలో ఉండలేని పరిస్థితి నెలకొందని న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై ఎస్ఐ సుమన్‌ని సంప్రదించగా.. భూతగదా, పాత కక్షలతో జగన్నాథం ట్రాక్టరుతో ఇంటి గేటు, ప్రహరీతోపాటు మునస్వామిని ఢీకొట్టి గాయపరిచిన ఘటన నిజమే.. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.





బాధితుడి భార్య అనసూయ - ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మునస్వామి



దాడికి ఉపయోగించిన ట్రాక్టర్

సెలవులో డీఎంహెచ్‌వో

ఇన్‌చార్జిని నియమించక పోవడంతో పెండింగ్‌లో ఫైళ్లు

చిత్తూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో సుధారాణి ఆరోగ్య సమస్యల కారణంగా 10 రోజులుగా సెలవుపై ఉన్నారు. ఇన్‌చార్జిని నియమించక పోవడంతో కార్యాలయంలో ఫైళ్లన్నీ పెండింగ్ పడ్డాయి. జిల్లాస్థాయి అధికారి, పైగా అత్యవసర విభాగాధిపతి సెలవుపై ఉంటే మరొకరికి ఎఫ్ఏసీ ఇవ్వడం ఆనవాయితీ. అయితే ఇంకా ఎవరికీ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వకపోవడం వల్ల కార్యాలయంలో ముఖ్యమైన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన పనులతో పాటు, ఫైళ్ల పెండింగ్‌లో ఉన్నాయి. దీనివల్ల ఏదైనా ముఖ్యమైన పనుల సమాచారం, వివరాలను ఎవరికి చెప్పాలో తెలియక సిబ్బంది అవస్థ పడుతున్నారు.

వరసిద్ధుడికి 27న ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 21 (కాణిపాకం): స్వయంభు కాణిపాక వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 27వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం పట్టువస్త్రాలను సమర్పించనుంది. ఈ వస్త్రాలను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమర్పించనున్నారు.

అసంక్రమిత వ్యాధులపై శిక్షణ

చిత్తూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో కార్యాలయంలో అసంక్రమిత వ్యాధుల(ఎన్‌సీడీ)పై పీహెచ్‌సీ వైద్యాధికారులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీఎంఆర్ స్టార్ ఎన్‌సీడీ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వేలూరు సీఎంసీకి చెందిన రీసెర్చ్ బృందం పలు అంశాలను తెలియజేసింది. ఐరాల, గంగాధరనెల్లూరు, ఎస్ఆర్‌పురం, బంగారుపాళ్యం మండలాల పీహెచ్‌సీ వైద్యాధికారులకు రెండ్రోజులపాటు శిక్షణ ఇస్తున్నట్లు అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు. వీరు ఆయా పీహెచ్‌సీల్లోని సిబ్బందికి శిక్షణ ఇస్తారని చెప్పారు.

కారు ఢీకొని యువకుడి మృతి

చౌడేపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో గురువారం జరిగింది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు... మండలంలోని పెద్దూరుకు చెందిన చక్రపాణి(28) ద్విచక్రవాహనంలో చౌడేపల్లెకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా చౌడేపల్లె జూనియర్ కళాశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చక్రపాణిని పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మృతిచెందిన చక్రపాణి

బీసీ వసతి భవన్‌కు భూమిపూజ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో జిల్లాలో అభివృద్ధి పరుగులు తీస్తోందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎస్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణంలో బీసీ బాలికల వసతి భవనానికి పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌పీ వెంకటేశ్వర చౌదరితో కలిసి భూమిపూజ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో సావిత్రమ్మ డిగ్రీ కళాశాలలో అదనపు సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. కళాశాలపై విశ్వాసంతో ఈ విద్యా సంవత్సరంలో 200లకు పైగా విద్యార్థినులు కళాశాలలో చేరారన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వసతి గృహ నిర్మాణంలో భాగస్వాములు కావడానికి ముందుకొచ్చిన మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, విజయం విద్యాసంస్థల అధినేత తేజోమూర్తిలకు కృతజ్ఞతలు తెలిపారు. చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు, స్థానికులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి





ముద్దుకృష్ణారెడ్డి, టీడీపీ నేతలను అభినందిస్తున్న ముఖ్యమంత్రి

టీడీపీ నాయకులకు చంద్రబాబు అభినందన

పాలసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండలం జడ్పీటీసీ ఉప ఎన్నికలో విజయం సాధించిన ముద్దుకృష్ణారెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. ఈ ఎన్నికలో బాధ్యతలు నిర్వహించిన మంత్రులు రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గ పరిశీలకుడు భీమనేని చిట్టిబాబునాయుడు, అన్నమయ్య జిల్లా టీడీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రాజుతో కలసి బుధవారం రాత్రి విజయవాడ టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రిని ముద్దుకృష్ణారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారందరినీ సీఎం అభినందించినట్లు భీమనేని తెలిపారు.

'కల్తీ' పాలనతో కమీషన్లకు కక్కుర్తి పడింది మీరే

● వైసీపీ నేతలు, సాక్షి మీడియాపై టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాం ధ్వజం

కుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిపై, ఆయన సేవకులైన తమపై దుష్ప్రచారం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని టీటీడీ పాలకమండలి సభ్యుడు వైద్యం శాంతారాం ధ్వజమెత్తారు. 'కల్తీ' పనులు చేసి కమీషన్లకు కక్కుర్తి పడి తిరుమలను అపవిత్రం చేసింది వైసీపీ పాలకులేనని మండిపడ్డారు. అబద్ధపు ప్రచారం చేస్తున్న సాక్షి మీడియా పద్ధతి మార్చుకోకపోతే హిందువులందరూ ఏకమై పనిపడతారని హెచ్చరించారు. కుప్పం టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో వారి ఎమ్మెల్యేలు ఎన్ని సేవా టిక్కెట్లు అమ్ముకుని తిరుమల కొండను వ్యాపార కేంద్రంగా మార్చారో అందరికీ తెలిసిందేనన్నారు. ఛైర్మన్‌గా పని చేసిన కరుణాకర రెడ్డి స్వయంగా సేవా టిక్కెట్లు అమ్ముకోలేదా, కమీషన్లు తీసుకోలేదా అని ధ్వజమెత్తారు. టీటీడీ ప్రస్తుత ఛైర్మన్ సొంత కారు, కనీసం నీళ్లు సైతం సొంత ఖర్చుతోనే తాగుతారని చెప్పారు. టీటీడీ పాలకమండలి గాని.. తమ ఎమ్మెల్యేలు కానీ టిక్కెట్లు అమ్ముకున్నట్లు ఆధారాలు ఇవ్వగలరా అని సవాల్ చేశారు. రెస్కో ఛైర్మన్ వీజీ.ప్రతాప్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కుప్పం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జి.మునిరాజు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, జేకే.సంతోశ్, మణి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు వసతుల కల్పనలో రాజీపడొద్దు

వరసిద్ధుడి ఆలయాన్ని తనిఖీ చేసిన ఆర్జేసీ

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు వసతుల కల్పనలో రాజీ పడొద్దని తిరుపతి ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్ సూచించారు. గురువారం వరసిద్ధుడి ఆలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లడ్డూ పోటును పరిశీలించారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు అవసరమైన లడ్డూ, వడలు సిద్ధం చేయాలని చెప్పారు. పులిహోర రుచి బాగుందని ప్రశంసించారు. అనంతరం ఆలయ అన్నదాన కేంద్రాన్ని తనిఖీ చేసి.. మరింత రుచికరంగా అన్నప్రసాదాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు ప్రసాద్, హరిమాధవరెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

పోటీచేయని రాజకీయ పార్టీలకు షోకాజ్ నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2019 నుంచి ఆరేళ్లుగా కనీసం ఒక్క ఎన్నికల్లో కూడా పోటీ చేయని రిజిస్టర్ అయిన గుర్తింపు లేని రాజకీయ పార్టీలకు భారత ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీచేసిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేట్ ఇండియా పార్టీ, వెనుకబడిన వర్గాల మహిళా రైతు పార్టీలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు. ఈనెల 28వ తేదీలోగా ప్రధాన ఎన్నికల అధికారికి అన్నిరకాల ఆధారపత్రాలతో లిఖితపూర్వకంగా వివరణ లేఖ అందజేయాలని సూచించారు. సెప్టెంబరు 8న సచివాలయంలోని ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయంలో ఆయా పార్టీల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు వ్యక్తిగతంగా హాజరుకావాలన్నారు.

మెగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు సిద్ధం

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. స్థానిక అపోలో, ఎస్వీసెట్ కళాశాలల్లో పరిశీలన చేపట్టనున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,473 పోస్టులు భర్తీ చేయనున్న నేపథ్యంలో 30 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ఎంఈవో, హెచ్‌ఎం, రెవెన్యూ డీటీ ఉంటారు. ఒక్కో బృందం కేవలం 50 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు మాత్రమే పరిశీలన చేయనుంది. ఏ బృందం వారి వద్ద ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేసుకోవాలనే వివరాలు రాష్ట్రస్థాయి నుంచి అభ్యర్థి మొబైల్‌కే సమాచారం అందుతుంది. 30 బృందాల పర్యవేక్షణకు మరో 10 బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక డిప్యూటీ డీఈవో, ఇద్దరు ఎంఈవో/హెచ్‌ఎంలు ఉంటారు. మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థి పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చనున్నారు.

వైసీపీలోనే వుంటా : కృపాలక్ష్మి

వెదురుకుప్పం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):వైసీపీలోనే ఉంటామని జీడీనెల్లూరు వైసీపీ ఇన్‌చార్జి కృపాలక్ష్మి తెలిపారు. గురువారం పుత్తూరులో మీడియాతో ఆమె మాట్లాడుతూ కొన్ని రోజులుగా నియోజకవర్గ ఇన్‌చార్జి మారతారని వస్తున్న వార్తల్లో నిజం లేదన్నారు. గ్రామాల్లో నెలకొని ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

పక్కాగా జరుగుతున్న స్వామిత్వ సర్వే : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంపిక చేసిన 300 గ్రామ పంచాయతీల్లో ఈనెల ఒకటో తేదీనుంచి గ్రామకంఠం ఆధారంగా స్వామిత్వ సర్వే పక్కాగా జరుగుతోందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, భూగర్భజలాలు, స్వామిత్వ, స్వచ్ఛ ఆంధ్ర అవార్డులపై సూచనలు, జిల్లా జువైనల్ ఏర్పాటు - అమలు, దిగువ కోర్టుల్లో ఖాళీగా వున్న లా ఆఫీసర్ పోస్టుల భర్తీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ జిల్లాకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. జేసీ విద్యాధరి, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు 25న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్లగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 25వ తేదీన సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరగనుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. సివిల్, ఏపీఎస్పీ విభాగాల్లో తుదిరాత పరీక్షల్లో ఎంపికైన స్త్రీ, పురుష అభ్యర్థులు చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లోని జిల్లా పోలీసు కార్యాలయానికి 25న ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలన్నారు. దరఖాస్తు సమయంలో జత చేసిన ధ్రువపత్రాల ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు గెజిటెడ్ అధికారి సంతకం చేసిన మూడు సెట్ల జెరాక్స్ కాపీలను, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకురావాలని సూచించారు.

గుంటూరులో ఎంపికైనవారికి 23న పరిశీలన

సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పరీక్షకు గుంటూరు జిల్లాలో హాజరై ఎంపికైన మన జిల్లా అభ్యర్థులు శనివారం ఉదయం పదిగంటలకు అక్కడి ఎస్పీ కార్యాలయం వద్ద హాజరు కావాల్సి ఉంటుంది. ఈ మేరకు గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

టీటీడీ పవిత్రతపై మాట్లాడే అర్హత కరుణాకరరెడ్డికి లేదు: టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పవిత్రతపైనా, ఛైర్మన్ బీఆర్ నాయుడు గురించి మాట్లాడే అర్హత టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డికి లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. గురువారం చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో టీటీడీ సమూల ప్రక్షాళన జరిగిందని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకుంటున్నారన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పించాలి

● గ్రామసభల్లో ఎయిర్‌పోర్టు భూనిర్వాసిత రైతుల డిమాండు

రామకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమకు ఉపాధి అవకాశాలు, నివాస సౌకర్యాలు సమకూర్చాలని కుప్పం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులు డిమాండు చేశారు. గురువారం ఆర్డీవో శ్రీనివాసులరాజు ఆధ్వర్యంలో రామకుప్పం మండల పరిధిలోని అంకిరెడ్లపల్లె, కిలాకిపోడు, కడిసినకుప్పం, వీరనాగపురం, మణీంద్రం గ్రామాల్లో సభలు నిర్వహించారు.రైతులు మాట్లాడుతూ తమకు వ్యవసాయం తప్ప వేరే అవకాశాలు లేవని.. ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించి తమకు నష్టపరిహారం పెంచాలని కోరారు. తాము భూములతోపాటు నివాస గృహాలు, పశువులషెడ్లు సైతం కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.రైతు కుటుంబాలకు ఉపాధి కల్పన, ఇళ్లస్థలాల కేటాయింపు, పక్కాఇళ్ల మంజూరుతో పాటు అదనపు నష్టపరిహారం చెల్లింపు తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు.తహసీల్దారు కౌలేష్, వైస్ ఎంపీపీ వెంకట్రామగౌడు, టీడీపీ నేతలు మునస్వామి, నారాయణాచారి, రామ్మూర్తి, గుర్రప్ప, శ్రీనివాసులరెడ్డి, కుమార్, భువన్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, రామలింగారెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులరాజు

ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో విషాదం

విద్యుదాఘాతంతో బిహార్ యువకుడి మృతి

బంగారుపాళ్యం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో విషాదం నెలకొంది. విద్యుదాఘాతంతో బిహార్‌కు చెందిన యువకుడు మృతి చెందాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బిహార్ రాష్ట్రం చాంపార జిల్లా జహీరగా గ్రామానికి చెందిన సురేంద్రరాయ్ కుమారుడు బబ్లుకుమార్ (19) బంగారుపాళ్యం మండలంలో జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తున్నాడు. గురువారం ఉదయం బ్రిడ్జి పనులు నిర్వహిస్తుండగా పక్కనే వెళుతున్న 11 కేవీ విద్యుత్ తీగలకు సెంట్రింగ్ కమ్మీలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆపై 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందాడు. మృతుడి తండ్రి సురేంద్రరాయ్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



బబ్లుకుమార్ మృతదేహం

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి



చిత్తూరు అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగ దగ్గరపడుతుండడంతో మండపాల ఏర్పాటుకు ఇచ్చే అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో సిస్టంను తీసుకొచ్చిందని ఎస్పీ మణికంఠ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.దాని ప్రకారం మండపాలను ఏర్పాటు చేయాలనుకునేవారు కమిటీగా ఏర్పడి వివరాలను సమీప పోలీసుస్టేషన్‌లో ఇవ్వాలి. తర్వాత Ganeshutsav.net వెబ్‌సైట్ ఓపెన్ చేసి.. అప్లై హియర్ అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. దరఖాస్తుదారుడి మొబైల్ నెంబరు నమోదు చేశాక తర్వాత వచ్చే ఓటీపీ నెంబరు నమోదు చేయాలి. పేరు, అడ్రస్, కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది. విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, ఎక్కడ నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి సబ్మిట్ చేయాలి. అప్లికేషన్ జనరేట్ అయ్యాక పోలీసుశాఖ అనుమతి కోసం వారి లాగిన్‌కు వెళుతుంది. అనుమతికి సంబంధించిన క్యూఆర్ కోడ్, నిర్వాహకులు పాటించాల్సిన నిబంధనలపై బుక్‌లెట్ డౌన్‌లోడ్ అవుతుంది. దాన్ని ప్రింట్ తీసుకుని మండపాల వద్ద ఉంచాలి. మండపాల వద్ద మైక్ అనుమతి కావాలనుకుంటే మీ-సేవ కేంద్రాల వద్ద పొందాలి. లౌడ్ స్పీకర్లను పెట్టకూడదు.మండపాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కమిటీ సభ్యులదే బాధ్యత.

ఆరు అన్న క్యాంటీన్లు మంజూరు

చిత్తూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పేదలకు నాణ్యమైన భోజనంతో కడుపు నింపుతున్న అన్న క్యాంటీన్లు మరో ఆరింటిని జిల్లాకు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే చిత్తూరు, కుప్పం, పుంగనూరు, పలమనేరు, నగరిలో 5 క్యాంటీన్లున్నాయి.కొత్తగా సీఎం చంద్రబాబు నియోజకవర్గం కుప్పానికి నాలుగు కేటాయించారు. కుప్పం మండలంలోని మల్లానూరు, రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె మండల కేంద్రాల్లో నాలుగు క్యాంటీన్లను మంజూరు చేశారు. పూతలపట్టు పట్టణంతో పాటు జీడీనెల్లూరు నియోజకవర్గ పరిధిలోని కార్వేటినగరం మండలంలో మిగిలిన రెండింటిని ఏర్పాటు చేయనున్నారు.పూతలపట్టులో క్యాంటీన్ నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే మురళీమోహన్ శంకుస్థాపన చేయగా బుధవారం రామకుప్పంలో ఆర్డీవో, అంతకుముందు గుడుపల్లెలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ శంకుస్థాపన చేశారు. ఇదిలా ఉండగా.. కొత్తగా మంజూరైన క్యాంటీన్ల ఏర్పాటు కోసం రెవెన్యూ శాఖ అధికారులు భూసేకరణ చేసి, పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ వారికి స్థలాన్ని అప్పగించారు. ఒక్కో క్యాంటీన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.60 లక్షలను మంజూరు చేసింది.

నేడు పుంగనూరుకు

కృష్ణాజలాలు



మదనపల్లె - ఈడిగపల్లె మధ్య ప్రవహిస్తున్న కృష్ణాజలాలు

మదనపల్లెలో హారతిచ్చి స్వాగతం పలికిన ఎమ్మెల్యే షాజహాన్ బాషా

పుంగనూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పడమటి ప్రాంత రైతులు చాలాకాలంగా ఎదురుచూస్తున్న కృష్ణాజలాలు శుక్రవారం నుంచి పరవళ్లు తొక్కనున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన హంద్రీనీవా ప్రాజెక్టు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరుగులు తీశాయి.సీఎం, జలవనరుల శాఖమంత్రి పనులను పర్యవేక్షించడంతో అధికారులు పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేశారు. రూ.530 కోట్లతో 265 కిలోమీటర్ల కాల్వ విస్తరణ, అభివృద్ధి పనులు చేసినట్లు హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్ఈ విఠల్‌ప్రసాద్ వివరించారు.కాల్వల హెచ్చుతగ్గులను సమం చేయడం, సిమెంట్ లైనింగ్, బెడ్ వర్క్, లిఫ్ట్ పనులు, కాల్వ విస్తరణ పనులు చేపట్టామన్నారు. కాల్వ గట్టుపై వాహనం వెళ్లేలా దారి ఏర్పాటు చేశామన్నారు. నంద్యాల జిల్లా మాల్యాల పంపింగ్ స్టేషన్ వద్ద కృష్ణా జలాలను గత నెల 17వ తేదిన సీఎం చంద్రబాబు హంద్రీనీవా కాల్వలకు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఆ నీళ్ల ఇటీవల అనంతపురం జిల్లా చెర్లోపల్లె రిజర్వాయర్‌కు,అక్కడినుంచి గురువారం మదనపల్లె మండలం చిప్పిలి వద్దకు చేరుకున్నాయి.ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రత్యేక పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు.మదనపల్లె పట్టణ ప్రజలకు తాగునీరు అందించే రెండు సమ్మర్ స్టోరేజి ట్యాంకుల మొరవల నిర్మాణానికి రూ.14కోట్లతో ప్రతిపాదనలు పంపారని, నిధులు మంజూరు కాగానే దాహార్తి తీరుస్తామన్నారు. కాగా రాత్రి 9-30 గంటలకు మదనపల్లె నవోదయ పాఠశాల వద్దకు కృష్ణాజలాలు చేరాయి. శుక్రవారం ఉదయం పుంగనూరు మండలం ఈడిగపల్లె, నేతిగుట్లపల్లెకు చేరుకుంటాయని ఎస్ఈ విఠల్‌ప్రసాద్ తెలిపారు. చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి 300 క్యూసెక్కులు నీరు విడుదల కాగా కాల్వల్లో 250 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నాయన్నారు.350 క్యూసెక్కుల సామర్థ్యం వున్న హంద్రీనీవా కాలువలో గంటకు రెండు కిలోమీటర్ల వేగంతో నీరు ప్రవహిస్తోందన్నారు. ఈనెల 26వ తేదీలోపు కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువుకు నీరు చేరుకుంటాయన్నారు.పుంగనూరు నియోజకవర్గంలోకి హంద్రీనీవా కాల్వల ద్వారా కృష్ణాజలాలు ప్రవేశించడం సంతోషకరమని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.ఎన్నికల హామీని చంద్రబాబు నెరవేర్చడంతో ప్రజలకు ఇక తాగు, సాగునీటి కష్టాలు తీరినట్లేనన్నారు.



చిప్పిలి వద్ద కృష్ణాజలాలకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

హంద్రీ-నీవా కాలువ పనులకు వర్షం అడ్డంకి

వి.కోట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : హంద్రీ-నీవా కుప్పం బ్రాంచ్ కాలువ పనులకు వర్షం అడ్డంకిగా మారింది.వారం రోజులుగా కురిసిన వర్షాలతో కాల్వకు అటు, ఇటు ప్రవహించే వంకల నుండి వాన నీరు పనులు జరిగే ప్రాంతానికి కొట్టుకురావడంతో కాంక్రీట్ పనులకు అంతరాయం ఏర్పడింది. హంద్రీ-నీవా కాల్వలో కృష్ణా జలాలు పలమనేరు నియోజకవర్గంలో 67 కిలోమీటర్లు, కుప్పం సెగ్మెంట్ పరిధిలో 64 కిలోమీటర్లు ప్రవహించి కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువు చేరనున్నాయి.రెండు నెలలుగా వి.కోట మండల పరిధిలో హంద్రీ - నీవా లైనింగ్ పనులు వేగంగా జరుగుతున్నాయి. వి.కోట పరిధిలో మెట్లపల్లె, ఆదినేపల్లె వద్ద రెండు లిఫ్ట్ హౌస్‌లు ఈ కాల్వపై ఉన్నాయి.అయితే కాల్వలో నీళ్ల ఇంకిపోతుండడంతో వాటికి రెండు వైపులా లైనింగ్‌తో పాటు కిందిభాగంలోనూ కాంక్రీట్ వేస్తున్నారు. దానమయ్యగారిపల్లె వద్ద హైవేకు ఇరు వైపులా కాలువ పనులు జరుగుతున్నాయి. గత వారం కురిసిన వానలకు ఇసుక మేటలు కాలువలో ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయాయి. వాటికి తోడు బురద నీళ్లు నిల్వ వుండడంతో కింద కాంక్రీట్ వేయాల్సిన చోట వర్షపు నీటిని తోడేందుకు మోటార్లను వాడుతున్నారు.వాటికి తోడు కాలువ లోపల కొట్టుకువచ్చిన మట్టి , ఇసుక మేటలను తొలగించడం కష్టంగా మారింది. దానమయ్యగారిపల్లె వద్ద పేరుకుపోయిన మట్టిని తొలగించి పనులు కొనసాగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. వి.కోట పరిధిలో హంద్రీ - నీవా కాలువ లైనింగ్ పనులు 95 శాతం పూర్తయ్యాయని, వర్షం లేకుంటే పది రోజుల్లో పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నారు.



హంద్రీ-నీవా కాలువలో వర్షపునీటిని బయటకు తోడే ప్రయత్నాలు

కుప్పం ఎయిర్‌పోర్టుకు క్యాబినెట్ ఆమోదం

- కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు కూడా



శాంతిపురం-రామకుప్పం మండలాల మధ్య విమానాశ్రయ ఏర్పాటుకోసం సేకరించిన భూమి

కుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు రాష్ట్ర మంత్రిమండలి గురువారం ఆమోదం తెలిపింది.సొంత నియోజకవర్గమైన కుప్పం అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానంగా దృష్టి సారించారు. ఈ అయిదేళ్లలో ఏకంగా ముప్పయ్యేళ్ల అభివృద్ధికి సాధిస్తామని ఆయన పదేపదే చెబుతున్నారు. అందుకు అనుగుణంగా శాతిపురం-రామకుప్పం మండలాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన చర్యలు ప్రారంభించారు. 2014-2019 మధ్యలోనే కార్గో విమానాశ్రయ ఏర్పాటుకోసం చర్యలు తీసుకున్నారు. అప్పట్లో శాంతిపురం మండలంలోని రామాపురం, దండికుప్పం, సొన్నేగానిపల్లె, రామకుప్పం మండలంలోని మణీంద్రం, కడిసినపల్లె, కిలాకిపోడు రెవెన్యూ గ్రామాల పరిధిలోకి వచ్చే సుమారు 15 గ్రామాలకు చెందిన రైతులనుంచి దాదాపు వెయ్యి ఎకరాల సేకరణకు ప్రయత్నాలు జరిగాయి. కొంతమందికి నష్టపరిహారం కూడా చెల్లించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ నేతలు విమానాశ్రయ ఏర్పాటుకు మోకాలడ్డారు.మళ్లీ 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు విమానాశ్రయ ఏర్పాటును పట్టాలమీదికి తీసుకు వచ్చారు. ఈసారి కార్గో కాకుండా ఏకంగా గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని ప్రతిపాదించారు. తొలుత ప్రతిపాదిత గ్రామాల పరిధిలో ఏకంగా 1800 ఎకరాల సేకరణకు ప్రయత్నాలు చేసి, దాదాపు సఫలీకృతులయ్యారు. రైతులకు ఎకరాకు రూ.16 లక్షల నష్టపరిహారాన్ని వాగ్దానం చేశారు. దీనిపై వారిలో విశ్వాసం కలిగించేందుకు గతంలో భూములు సేకరించిన రైతులకు పెండింగులో ఉన్న పరిహారం బకాయిలను వడ్డీతో సహా ఇటీవల చెల్లించారు. ఇందుకోసం ప్రత్యేకంగా జీవో తీసుకు వచ్చి ఏకంగా రూ.25 కోట్లు విడుదల చేసి, పంపిణీని పూర్తి చేశారు. దీనికి సమాంతరంగా గ్రామ సభలు నిర్వహించి భూ సేకరణకు రైతులనుంచి పూర్తిస్థాయిలో అనుమతులు తీసుకున్నారు. ప్రతిపక్ష వైసీపీ ప్రోద్బలంతో ఇంకా అక్కడక్కడా అభ్యంతరాలు ఉన్నా సరే, వాటిని కూడా సామరస్యపూర్వక వాతావరణంలో పరిష్కరించేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో కుప్పంలో గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం అంశం క్యాబినెట్ మీటింగులో 24వ అంశంగా చేరింది. ముసాయిదా ఆర్ఎఫ్‌పీని ఆమోదించడంతోపాటు హడ్కో రుణాన్ని తీసుకుని భూ సేకరణ, యుటిలిటీ బదిలీ ప్రక్రియ పూర్తి చేయడానికి సమావేశంలో నిర్ణయించారు. ప్రతిపాదిత విమానాశ్రయంకోసం బాహ్య మౌలిక వసతుల కల్పనకు పెట్టుబడులు-పరిశ్రమల శాఖ చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది.అలాగే కుప్పం మున్సిపాలిటీ భైరుగానిపల్లె పరిధిలో సర్వే నెంబర్ 19/1ఎ లోని 7.74 ఎకరాల ప్రభుత్వ భూమిలో కేంద్రీయ విద్యాలయ పాఠశాలను ఏర్పాటు చేయడానికి కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. టీడీపీ అధికారంలోకి రాగానే కేంద్రీయ విద్యాలయ స్థాపనకోసం ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం సేకరించిన 7.74 ఎకరాల భూమిలో సుమారు 1.30 ఎకరాల ప్రైవేటు భూమి ఉంది. ఈ భూమి యజమానికి వేరేచోట భూమి చూపించారు. అందుకు బదులుగా కేంద్రీయ విద్యాలయ కోసం 1.30 ఎకరాల భూమిని ప్రభుత్వం అతనినుంచి రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియ కూడా పూర్తయింది. సేకరించిన మొత్తం భూమిని న్యూఢిల్లీకి చెందిన కేంద్రీయ విద్యాలయ సంఘస్థాన్ వారికి ఉచితంగా అప్పగించే ప్రతిపాదనకు మంత్రి మండలి తాజాగా ఆమోదం తెలిపింది.

ఐదుగురు లైన్‌మెన్ సస్పెన్షన్

చిత్తూరు రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డ్యూటీ టైంలో పర్మిషన్ తీసుకోకుండా కలెక్టరేట్‌కు వెళ్లిన ఐదుగురు లైన్‌మెన్లను సస్పెండ్ చేస్తూ విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.జేఎల్ఎం సంఘ నాయకులైన సంతపేట సెక్షన్‌లో పనిచేసే దొరబాబు, కొంగారెడ్డిపల్లెలో పనిచేస్తున్న రామకృష్ణ , మిట్టూరులో పనిచేస్తున్న మల్లికార్జున్, పూతలపట్టు సెక్షన్‌కు చెందిన ప్రేమ్‌కుమార్, యశ్వంత్ కలిసి గత సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు వెళ్లారు. ప్రమోషన్లు పొందడానికి అవసరమైన కోర్సులు చేసేందుకు రాత్రి కళాశాలకు వెళ్తామని కలెక్టరును కోరారు.అక్కడే ఉన్న జేసీ విద్యాధరి గతంలోనే ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు.అత్యవసర సేవల్లో పనిచేస్తున్న వారికి అలా దీర్ఘకాలిక అనుమతి ఇవ్వడం కుదరదని, కావాలంటే సెలవు పెట్టి శిక్షణ తీసుకోవచ్చుని తెలియజేసినట్లు చెప్పడంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు.ఇదివరకే చర్చించిన విషయాన్ని తిరిగి కొత్తగా తనకు తెలపడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్‌ని పిలిచి డ్యూటీ టైంలో వచ్చిన జేఎల్ఎంలు అనుమతి తీసుకున్నారా అని అడగ్గా లేదని ఆయన చెప్పడంతో వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో వారిని గురువారం సస్పెండ్ చేస్తూ ఎస్ఈ ఉత్తర్వులు జారీ చేశారు.



పలమనేరులో యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

యూరియాకు ఒకటే డిమాండు

అధిక వినియోగం ప్రమాదకరమంటున్న వ్యవసాయ అధికారులు

పలమనేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు, గంగాధరనెల్లూరు తదితర ప్రాంతాల్లో గురువారం యూరియా కోసం రైతులు క్యూకట్టారు. పలమనేరు మండలంలోనే ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దాదాపు 650 మెట్రిక్ టన్నుల మేర యూరియాను విక్రయించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.వరికే కాకుండా పశుపోషణ కోసం ఉపయోగించే ఫారం గడ్డికి , మల్బరీ తోటలకు రైతులు పెద్దఎత్తున యూరియా వినియోగిస్తుండడంతో యూరియాకు డిమాండు బాగా పెరిగింది.యూరియా మాత్రమే వినియోగించడం వలన క్రమేపీ భూమి నిస్సారమై పంటల సాగుకు పనికి రాకుండా పోతుందని అధికారులు చెబుతున్నా రైతులు పట్టించుకోవడం లేదు. యూరియాతో పాటు సేంద్రియ ఎరువులు, కాంప్లెక్స్ ఎరువులు కూడా వినియోగించాలని వారు చెబుతూనే వున్నారు.యూరియా అధికంగా వేసి పెంచిన గడ్డిని తినడం పాడి ఆవులకు గర్భధారణ కు ప్రతిబంధకంగా మారుతుందని, పాలలో కూడా నాణ్యత కొరవడుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు.

తిరుమలలో నాగచైతన్య, శోభిత



తిరుమల, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో పలువురు సినీ ప్రముఖులు దర్శించుకున్నారు. హీరో అక్కినేని నాగచైతన్య, శోభిత దూళిపాళ్ల దంపతులు, దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్, కన్నడ నటి తార, సౌమ్య రెడ్డి ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు నాగచైతన్య దంపతులను చూసేందుకు పలువురు అభిమానులు ఉత్సాహం చూపారు.

ఆధ్యాత్మిక అందాలకు పర్యాటక శోభ!

● కంగుంది దుర్గం అభివృద్ధికి ప్రభుత్వ చర్యలు



దుర్గంపై దుర్గం మల్లేశ్వరస్వామివారి మహత్యం వివరిస్తున్న పీఎస్ఎం



గత వైభవ చరిత్రకు అద్దంపట్టే కంగుంది కోటలోని ఓ పార్శ్వం

కుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు ఆధ్యాత్మికత, మరోవైపు ప్రాకృతిక సౌందర్యం మూర్తీభవించిన కంగుంది దుర్గానికి పర్యాటక శోభ చేకూరనుంది. వెయ్యేళ్ల చరిత్ర కలిగిన కుప్పం మండలం కంగుంది కోటతో పాటు కంగుంది దుర్గంపై వెలసిన దుర్గం మల్లేశ్వరస్వామివారి సన్నిధిని అన్నివిధాలా అభివృద్ధి చేసి పర్యాటకుల స్వర్గధామంగా రూపొందించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం గురువారం కంగుంది దుర్గాన్ని, దుర్గం మల్లేశ్వరస్వామి ఆలయాలను సందర్శించారు. పర్యాటక అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలతో ఆయన చర్చించారు. వారి అభిప్రాయాలు తీసుకున్నారు. పరిసరాలను పరిశీలించి ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధి చేస్తే మరింతగా ఆధ్యాత్మిక, ప్రాకృతిక శోభ ఇనుమడిస్తుందో రాసుకున్నారు. పీఎస్ఎం మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం అభివృద్ధిపై దృష్టి సారించారన్నారు. కంగుంది కోటను ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కుప్పం మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కోమటివాని చెరువులో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కోమటివానిచెరువులో చెత్తను తొలగిస్తున్న అధికారి

చౌడేపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోమటివాని చెరువులో ఎట్టకేలకు పంచాయతీ అధికారులు చెత్తను తొలగించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో 'చెరువే.. డంపింగ్ యార్డు' అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎంపీడీవో లీలామాధవి చెత్తతో చెరువులో నీరు కలుషితం కాకుండా వెంటనే శుభ్రం చేయాలని, ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికే తరలించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి జాకీర్‌బాషా కోమటివాని చెరువులోని చెత్తను ఎక్స్‌కవేటరుతో గుంతలు తీసి పూడ్చేశారు.

పారదర్శకంగా సబ్సిడీ పంపిణీ

కల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి రైతులకు అందజేసే సబ్సిడీ పంపిణీ పారదర్శకంగా చేపడుతామని పులిచెర్ల ఉద్యానశాఖ అధికారిణి సంతోషికుమారి తెలిపారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి, దిగువపోకలవారిపల్లి సచివాలయాల్లో మామిడి రైతులతో గురువారం గ్రామసభలు నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం కిలోకు రూ.4 సబ్సిడీ అందజేయడం జరుగుతుందన్నారు. రెండు రోజుల్లో లబ్ధిదారుల పూర్తి జాబితాను రైతులకు అందజేస్తామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం పంచాయతీ కేంద్రం బందార్లపల్లెకు చెందిన నారాయణప్ప గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డిలు స్థానిక నేతలతో కలిసి నారాయణప్ప మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి పార్టీ తరపున రూ.10 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ మల్లేష్‌యాదవ్

రామకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలని కుప్పం గ్రామీణ సీఐ మల్లేష్‌యాదవ్, రామకుప్పం ఎస్ఐ వెంకట మోహన్ కోరారు. రామకుప్పం మండలం విజలాపురంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం వారు ప్రారంభించారు. యువత వ్యసనాలకు బానిస కాకుండా సత్ప్రవర్తనతో మెలుగుతూ ప్రయోజకులుగా మారాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ మధుసూదన్, శారద స్కూల్ ప్రిన్సిపాల్ మంజునాథ్, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

141 మంది దివ్యాంగుల పింఛనుదారులకు నోటీసులు

రామకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో 141 మంది దివ్యాంగుల పింఛనుదారులకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీవో లక్ష్మీకాంత్ తెలిపారు. నోటీసులు అందుకున్న వారు తమకేమైనా అభ్యంతరాలుంటే వెల్ఫేర్ అసిస్టెంట్‌తో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వద్ద పరీక్షలు చేసుకుని ధ్రువపత్రాలు పొందాలని ఆయన సూచించారు. అప్పటి వరకు వారికి యథావిధిగా పింఛన్లు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలి

పలమనేరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు జీతాలు పెంచాలని, ఎఫ్.ఆర్.ఎస్ రద్దుచేయాలని కోరుతూ గురువారం పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ ఇవ్వాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండు చేశారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, ఏయూఐటీయూసీ యూనియన్ నాయకులు గిరిధరగుప్తా, పద్మమ్మ, శాంతి, లక్ష్మీ, మంజు, లలితమ్మ, సరస్వతి, నీరజ, రాధ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బోయకొండ పాలక మండలి సభ్యత్వం కోసం దరఖాస్తు

చౌడేపల్లె, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ పాలక మండలి సభ్యులుగా బోయకొండ మాజీ చైర్మన్ ఎస్‌కే వెంకటరమణరెడ్డి గురువారం ఈవో ఏకాంబరానికి దరఖాస్తు అందించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి సోమల సురేష్, మరి కొంతమంది అనుచరులతో కలిసి 20 మంది దరఖాస్తులు అందజేశారు. అలాగే పుంగనూరు బీజేపీ నాయకులు నానబాల కుమార్, చౌడేపల్లె నుంచి టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మంజునాథ్ రెడ్డి, రామచంద్ర వారి అనుచరులతో కలిసి దరఖాస్తులు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఏకాంబరం మాట్లాడుతూ ఒక్కరోజులో 33 దరఖాస్తులు అందాయని, ఇప్పటి వరకు మొత్తం 57 దరఖాస్తులు అందినట్లు తెలిపారు.

వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు

కుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం పట్టణంలో గురువారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి- ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు వైభవంగా జరిగింది.

నేడు ఏఎంసీ ప్రమాణ స్వీకారం



మంత్రుల రాక ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ శమిపతి యాదవ్, టీడీపీ నాయకులు

పుంగనూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మార్కెట్‌యార్డులో జరిగే ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకరణకు రాష్ట్ర మంత్రులు ఎం.రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి శుక్రవారం రానున్నట్లు ఏఎంసీ చైర్మన్ ఎన్.శమీపతి యాదవ్ తెలిపారు. గురువారం మార్కెట్ యార్డులో సభ, వేదిక ప్రాంతాలను నాయకులు సీవీ రెడ్డి, పోలీసుగిరి, ఏఎంసీ డైరెక్టర్లతో కలిసి పరిశీలించారు.

సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోండి

కుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని పౌరులు వినియోగించుకోవాలని మున్సిపల్ అధికారులు ప్రజలకు సూచించారు. కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 2, 3, 4, 5 సచివాలయాల పరిధిలో గురువారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సులు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సచివాలయ కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ సేవల్లో ఎటువంటి లోపమున్నా, సంబంధిత సమాచారం ఏది కావాల్సి వచ్చినా సమాచార హక్కు చట్టంతో నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసి పొందొచ్చని తెలిపారు. దరఖాస్తు చేసే విధానం గురించి వివరించారు. కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీపీవో సుధాకర్

పుంగనూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించే భోజనాల్లో నాణ్యత పాటించాలని పుంగనూరు ప్రత్యేకాధికారి డీపీవో టి సుధాకర్ ఆదేశించారు. గురువారం మండలంలోని గూడూరుపల్లె, కపాడమిట్టపల్లె గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులకు అండగా చంద్రబాబు

రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు రాష్ట్రంలో రైతులకు అండగా నిలుస్తున్నారని శాంతిపురం మండలం గుంజార్లపల్లె పంచాయతీ సర్పంచి విజయరామిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి ఆంజనేయరెడ్డి తెలిపారు. గురువారం గుంజార్లపల్లె గ్రామ సచివాలయంలో వారు రైతులకు మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

రామకుప్పం/శాంతిపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం ఐటీఐ కళాశాలలో మూడోసారి ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ శేషారెడ్డి తెలిపారు. అభ్యర్థులు ఈనెల 26లోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 27న సాయంత్రం లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాల కార్యాలయానికి రావాలన్నారు. ఈనెల 29న కళాశాలలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

దోమల నివారణకు చర్యలు

కుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘంలో దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కమిషనర్ ఆదేశాల మేరకు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది కాలువలు శుభ్రపరచి, దోమల నివారణకు అవసరమైన మలాథిన్ ఆయిల్‌ను పిచికారీ చేశారు.



సీఎంకు భానుప్రకాష్ కృతజ్ఞతలు



నగరి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నగరి గడ్డపై ఎన్నికల వేళ మరమగ్గ కార్మికులకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చిన సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే భానుప్రకాష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు గురువారం అమరావతి సచివాలయంలో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. 500 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. అలాగే నగరి, విజయపురం, నిండ్ర మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని కోరారు. తమిళనాడుకు సరిహద్దున ఉన్న విజయపురం మండలంలోని కోసలనగరాన్ని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్నారు. వేణుగోపాలసాగర్ ప్రాజెక్టు పనులు పూర్తయ్యేలా చూడాలని విన్నవించారు. నియోజకవర్గంలోని పరిస్థితులపైనా చర్చించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి: డీఎస్పీ

నగరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, ప్రాణాలు కాపాడుకోవాలని డీఎస్పీ అజీజ్ సూచించారు. నగరి పట్టణలోఓని ఓంశక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకు చేపట్టిన ర్యాలీని పచ్చజెండా ఊపి డీఎస్పీ ప్రారంభించారు. ఓంశక్తి ఆలయం నుంచి ర్యాలీగా వచ్చి టవర్‌క్లాక్ వద్ద మానవహారం నిర్వహించారు. సీఐ విక్రమ్, ఎస్ఐ విజయ్‌నాయక్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పోలీసుశాఖ సంయుక్తంగా హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ చేశారు. సీఐ హనుమంతప్ప, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి: ఆర్డీవో

పాలసముద్రం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ సిబ్బందిపై ఉందని నగరి ఆర్డీవో అనుపమ అన్నారు. గురువారం పాలసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ అరుణకుమారి, డీటీలు రిషివర్మ, అశోక్‌కుమార్, ఆర్ఐ దేవి, సర్వేయర్లు పాల్గొన్నారు.

వంద శాతం అక్షరాస్యత సాధించాలి

గుడిపాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వయోజన విద్యలో వంద శాతం అక్షరాస్యత సాధించాలని వయోజన విద్య శాఖ పర్యవేక్షకుడు కందేశ్వరరావు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉల్లాస్ ఫేస్-2 కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. మండలంలో 3,725 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించామన్నారు. ప్రస్తుతం 1,650 మంది నిరక్షరాస్యులు ఎన్నుకుని ప్రతి పది మందికి ఓ వలంటీర్‌ను ఏర్పాటు చేసి, ఆరునెలల్లో అక్షరాస్యులను చేయాలన్నారు. వెలుగు ఏపీఎం సుధారాణి, ఉపాధి హామీ పథకం ఏపీవో శ్రీనివాసులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సరస్వతీ దేవి విగ్రహ ప్రతిష్ఠ



నగరి ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నగరి పట్టణంలోని పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహాన్ని గురువారం ప్రతిష్ఠించారు. ధనలక్ష్మి, రామకృష్ణలు ఈ విగ్రహాన్ని విరాళంగా ఇవ్వగా, పాలేగారు శాంతి, గోపిలు వేదికను నిర్మించారు. వెంకటేశులు శెట్టి, ఢిల్లీబాబుశెట్టి పూజాసామగ్రిని సమకూర్చారు. పూర్వ విద్యార్థులు డీసీసీ కో-ఆపరేటివ్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, విశ్రాంత డీవైఈవో ప్రభాకర్ రాజు, పారిశ్రామికవేత్త సరస్వతి రాజగోపాల్‌రాజు, రమేష్, టీచర్లు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం: జేసీ



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న జేసీ విద్యాధరి

పెనుమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా ప్రభుత్వం ఉంటుందని జేసీ విద్యాధరి తెలిపారు. చిప్పారపల్లె పంచాయతీలోని పాళ్యం యానాది కాలనీలో గురువారం పర్యటించారు. అక్కడ నివసిస్తున్న వారికి ఇంటి పట్టాలు అందజేశారు. అవసరమైనవారికి ఇళ్లు కట్టించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంపీడీవో కిషోర్, మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, జడ్పీటీసీ దొరస్వామి, సెక్రటరీ జ్యోతీశ్వర్, రాజగోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

నగరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరమని డీఎస్పీ అజీజ్ సూచించారు. నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో జరిగిన న్యాయవిజ్ఞాన సదస్సులో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఎస్ఐ తేజస్విని మాట్లాడుతూ విద్యార్థినులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే భద్రతను పొందవచ్చో వివరించారు. క్రిమినల్, సివిల్ కేసులపై ఏపీపీ శాంతి వివరించారు. ప్రిన్సిపాల్ వేణుగోపాల్, ఇందిరా ప్రియదర్శిని, రేవతి, భాస్కర్, గోపి, బాసా, మహేశ్వరి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలపై ఖాతాదారులకు అవగాహన

గంగాధరనెల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డీసీసీబీ సేవలపై గంగాధరనెల్లూరు బ్రాంచ్ ఆవరణంలో గురువారం ఖాతాదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటాచలపతి, బీఎం గోమతి, సింగిల్‌విండో సీఈవో విజకుమార్‌రెడ్డి, సూపర్‌వైజర్ మాబూని, సింగిల్‌విండో స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి పాల్గొన్నారు.

'నగరాభివృద్ధికి సహకరిద్దాం'



ఏసీపీకి అంగీకార పత్రాన్ని ఇస్తున్న సురేష్‌బాబు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధికి సహకరిద్దామని ఓ భవన యజమాని సురేష్ బాబు పిలుపునిచ్చారు. హైరోడ్డు విస్తరణలో కట్టమంచి వద్ద ఈయనకు చెందిన ఓ భవనం పోతుండటంతో నష్ట పరిహారానికి బదులు టీడీఆర్ బాండ్ ఇచ్చినా అభ్యంతరం లేదన్నారు. తన భవనాన్ని పడగొట్టడానికి అంగీకారపత్రాన్ని ఏసీపీ నాగేంద్రకు గురువారం అందజేశారు.

దుకాణాల షెడ్ల తొలగింపు

బంగారుపాళ్యం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మొగిలి సమీపంలో జాతీయ రహదారికి ఆనుకుని కొందరు ఆక్రమించి నిర్మించుకున్న దుకాణాల షెడ్లను గురువారం తొలగించారు. తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్. సర్వేయర్ లావణ్య, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా బస్తాల కోసం క్యూ కట్టిన రైతులు



గంగాధరనెల్లూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు సింగిల్‌విండో సొసైటీ కార్యాలయం ఆధ్వర్యంలో బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ బస్తాలను రైతులకు అందజేశారు. దీంతో ఒక్కరోజులోనే స్టాక్ మొత్తం అయిపోయింది. మార్క్‌ఫెడ్ శాఖ అధికారులు మండలాల్లోని పంచాయతీలు, వ్యవసాయ, పాడిరైతుల వివరాల ఆధారంగా స్టాక్‌ను పంపించి ఇబ్బందుల్లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

పూతలపట్టులో అన్న క్యాంటీన్‌కు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు పోలీస్ స్టేషన్ సమీపాన రూ.60లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనానికి గురువారం ఎమ్మెల్యే మురళీమోహన్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. పేదవాడి ఆకలి తీర్చేడమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, నాయకులు కోదండ యాదవ్, ప్రతాపనేని చంద్రమౌళి, గుంటూరు మురళి, గిరిధర్ బాబు, చిరంజీవి నాయుడు, హిమగిరి నాయుడు, ఎన్‌పీ ధరణి, బాలకృష్ణమ నాయుడు, గురుస్వామి, హరి, జగన్నాథం, బాబురావు, నాగరాజు నాయుడు, అధికారులు పాల్గొన్నారు.



వరసిద్ధుడి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ గురువారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి అరుణసారిక, ఆలయ ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, ప్రసాద్, తహసీల్దార్ లోకేశ్వరి, సూపరింటెండెంట్ కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.





జిల్లా జడ్జి, ఎస్పీలకు బ్రహ్మోత్సవ ఆహ్వానం: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ఈనెల 27వతేదీ నుంచి నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలని జిల్లా జడ్జి అరుణసారిక, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరిని, ఇతర ముఖ్య అధికారులను గురువారం ఈవో పెంచలకిషోర్, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్ గురుకుల్ ఆహ్వానించారు.

రేపు సీపీఐ మహాసభలు

నగరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో శనివారం సీపీఐ మహాసభలు జరగనున్నాయని నియోకవర్గ కార్యదర్శి కోదండయ్య తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను నగరి అంబేడ్కర్ విగ్రహం వద్ద వేలన్, బాషా, విజయ్‌కుమార్, దశరథ, సురేష్ తదితరులతోకలిసి గురువారం ఆవిష్కరించారు.

గొడుగుచింతలో ఆధార్ కేంద్రం

పూతలపట్టు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మురళీమోహన్ స్వగ్రామమైన గొడుగుచింతలో గురువారం ఆధార్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చిత్తూరు డీఎల్డీవో రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మోహనమ్మ, గుణశేఖర్, సుబ్రహ్మణ్యం, దాము పాల్గొన్నారు.

సన్మానం



బంగారుపాళ్యం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్‌గా చైర్మన్‌గా ఎన్నికైన నాగేశ్వర నాయుడిని సన్మానించారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లెలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ బాబు, చెన్నకేశవులు, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీల రక్షణ చట్టం అమలు పరచండి


చిత్తూరు సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): బీసీల రక్షణ చట్టం అమలు పరచాలని టౌన్ బ్యాంక్ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత షణ్ముగం కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కలిసి సత్కరించారు. సెప్టెంబరు 14వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్న బీసీ విద్యార్థుల మహాసభకు రావాలని మంత్రిని ఆహ్వానించారు.

'అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి'

వెదురుకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మమత డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం అంగన్‌వాడీ వర్కర్లతో కలిసి ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద, చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా నినాదాలు చేశారు.

నగరి: తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ధనకోటి, సుజాత, లత, శివగామి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సన్మానం



వెదురుకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవంలో ప్రశంసాపత్రం అందుకున్న కార్వేటినగరం ఎంపీడీవో చంద్రమౌళిని గురువారం టీడీపీ నేతలు సన్మానించారు. మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, నేతలు తిరుమలనాథ్, బీగాల రమేష్, హేమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులు.. జాబితాలో పేర్లను పరిశీలించుకోండి





అర్జీని పరిశీలిస్తున్న మధుసూదన్ రెడ్డి - పంటను పరిశీలిస్తున్న మురళీకృష్ణ

గుడిపాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలను ఫ్యాక్టరీలకు తరలించిన రైతులు.. సబ్సిడీ పొందడానికి విడుదలైన జాబితాలో పేర్లు పరిశీలించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ సూచించారు. గురువారం బసవానవాపల్లె సచివాలయంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఫ్యాక్టరీలకు నాలుగు టన్నులు తోలితే మూడు టన్నులుగా నమోదైందని, ఇలాంటి తప్పులను సచివాలయంలో ఈనెల 25వ తేదీలోపు నమోదు చేసుకోవాలని చెప్పారు. అనంతరం బసవాపల్లెలో వేరుశన, చెరకు పంటలను పరిశీలించారు. వ్యవసాయ అధికారి మాధవి, సిబ్బంది యోగప్రియ, వీఆర్వో కరుణాకర్ పాల్గొన్నారు.

జాబితాపై గ్రామసభలు

పెనుమూరు: శాతంబాకం సచివాలయం వద్ద జరిగిన గ్రామసభలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, వ్యవసాయాధికారి సుహర్‌లత, వీఏఏ సంధ్య, వీఆర్వో శశి, కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: బోడబండ్ల, జంబువారిపల్లె, నలగాంపల్లె, గుంతూరు, బంగారుపాళ్యం గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామసభలు జరిగాయి. వ్యవసాయాధికారులు కోకిల, జయశ్రీ, సర్పంచు షీబా స్వామిదాస్, గురుజాల సురేంద్రనాయుడు, గిరిబాబు, నలగాంపల్లె శివ, రైతులు పాల్గొన్నారు.

యాదమరి: జంగాలపల్లెలో జరిగిన గ్రామసభలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూధన్ రెడ్డి హాజరయ్యారు. వరదరాజులపల్లె, కొటాల, రైతుసేవా కేంద్రంలో తహసీల్దార్ పార్థసారథి గ్రామసభలు నిర్వహించారు. ఏవో దీప, సిబ్బంది పాల్గొన్నారు.

మా బడిని మార్చొద్దు



డీఈవో కార్యాలయం వద్ద గొల్లకండ్రిగ గ్రామస్తులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమ బడిని మార్చొద్దని కోరుతూ కార్వేటినగరం మండలం కేఎంపురం పంచాయతీ గొల్లకండ్రిగ గ్రామస్తులు కోరారు. ఈ మేరకు గురువారం డీఈవో కార్యాలయానికి వచ్చారు. వారు మాట్లాడుతూ.. గొల్లకండ్రిగలోని ఎంపీపీ పాఠశాలను మోడల్ స్కూల్ పేరుతో కేఎంపురం పాఠశాలలో విలీనం చేయడం సరికాదన్నారు. పాఠశాలలో 24 మంది విద్యార్థులుండగా, విలీనం తర్వాత 10 మంది ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారని చెప్పారు. మిగిలిన 14 మంది పిల్లల్ని 3.5 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు పంపించలేమన్నారు. దీనిపై డీఈవోకు వినతిపత్రం ఇచ్చిన అందజేశారు. గ్రామస్తులు సందీప్, నరేష్, దేశమ్మ, వరలక్ష్మి, లోకనాథం, వరాలు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పునరుద్ధరించండి

గుడిపాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమ పింఛన్లను పునరుద్ధరించాలని పింఛనుదారులు గురువారం డాక్టర్ సంధ్య, సూపరింటెండెంట్ కుమార్‌ని కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో అధికారులను కలిసి ఈ మేరకు విన్నవించారు. ఎవరికైనా పొరబాటున పింఛను తొలగించి ఉంటే.. కొత్త సదరం సర్టిఫికెట్ తీసుకున్నాక పింఛను మంజూరు చేస్తారని అధికారులు తెలిపారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి




సమావేశంలో ప్రసంగిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి

నిండ్ర, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పిలుపునిచ్చారు. గురువారం నిండ్రలోని మండల సమైక్య (వెలుగు) కార్యాలయంలో జరిగిన సంఘమిత్రల (వీఏవో)ల సమావేశంలో ఆమె ప్రసంగించారు. రుణాలను సభ్యులు సక్రమంగా చెల్లించేలా వీవోఏలు కృషి చేయాలన్నారు. ఎంపీడీవో శివప్రసాద్‌వర్మ, వివిధ విభాగాలకు చెందిన డీపీఎంలు సునీత, హేమ మధుసూదన్, సుబ్బారెడ్డి, సింగన్న నిండ్ర ఏపీఎం పళణి, సీసీలు భాస్కర్, లక్ష్మయ్య, గిరి, మండల సమైక్య అధ్యక్షురాలు హిందూమతి, కార్యదర్శి భవాని పాల్గొన్నారు.

మహా ధర్నా వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

వెదురుకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 25వ తేదీన జరగనున్న మహాధర్నా పోస్టర్లను 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల ఫోరం నేతలు ఆవిష్కరించారు. గురువారం సాయంత్రం కార్వేటినగరం ఎమ్మార్సీ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో ఫోరం డివిజనల్ కన్వీనర్ సి.వెంకటేశ్వర్లు ప్రసంగించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిపై చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కిరణ్, పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ నాగేంద్రరాజు, ఉపాధ్యాయ వాణి కన్వీనర్ సర్దార్, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు జయశంకర్, 2003 డీఎస్సీ టీచర్లు బి.మధు, పి.గౌరీ మద్దతు తెలిపారు.

డ్రైనేజీ సమస్య పరిశీలన



సిబ్బందికి సూచనలిస్తున్న రవికుమార్

యాదమరి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కోణాపల్లె గ్రామపంచాయతీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్థానికుల ఫిర్యాదుతో జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు గురువారం పరిశీలించారు. తక్షణమే కొత్త మురుగుకాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని అధికారులకు సూచించారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబీ, కార్యదర్శి గజేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం

వెదురుకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం జగన్నాథపురం ఎస్టీ కాలనీకి రూ.2.83 కోట్లతో బీటీ రోడ్డు మంజూరైందని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. రోడ్డు సమస్యపై పలుమార్లు ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన రాష్ట్ర ప్రభుత్వ విప్ సమస్య పరిష్కారానికి నిధులు మంజూరు చేయించారని ఎంపీడీవో ప్రకటించారు. దీంతో ఆయన్ను కాలనీవాసులు సన్మానించారు.

విద్యుత్ మోటార్ల వైర్ల దొంగ అరెస్టు

వెదురుకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మోటార్ల వైర్ల దొంగను అరెస్టు చేశారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. కార్వేటినగరం మండలం ఎర్రమరాజుపల్లికాలనీకి చెందిన ధనుంజయులు కుమారుడు ఉదయ్‌కుమార్(30) ఈ ఏడాది జూలై 22వ తేదీన కొమరగుంట గ్రామ పరిసరాల్లో వైర్లను చోరీ చేశాడు. అతడిని అరెస్టు చేసి, సుమారు రూ.లక్ష విలువ చేసే కాపర్ వైర్లను స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించామని గురువారం తెలిపారు.

బంగారెడ్డిపల్లెలో చోరీ

● రూ.1.30 లక్షలు, 10 సవర్ల బంగారు నగల అపహరణ

చిత్తూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని బంగారెడ్డిపల్లెలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మునిరాజులు ఇంటి తలుపులు, బీరువా పగలగొట్టి డబ్బులు, బంగారు నగలు ఎత్తుకెళ్లారు. కూలిపనులకు వెళ్లిన మునిరాజులు భార్య ఇంటికి వచ్చేసరికి తలుపులు, బీరువా పగులగొట్టి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూ.1.30 లక్షలతోపాటు 10 సవర్ల బంగారు నగలు చోరీ చేసినట్లు బాధితురాలు తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టారు.

తమిళనాడు బియ్యం స్వాధీనం: ఇద్దరి అరెస్టు

గుడిపాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు బియ్యాన్ని అమ్ముతుండగా గురువారం ఇద్దరిని అరెస్టు చేశారు. ఎస్ఐ రామ్మోహన్ తెలిపిన వివరాల మేరకు.. కొంతకాలంగా తమిళనాడు బియ్యాన్ని మండలంలో విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో పోలీసులు నిఘా పెట్టారు. తమిళనాడుకు చెందిన పూర్ణ అక్కడి బియ్యాన్ని తన ఆటోలో తీసుకొచ్చి గంగాసాగరంకు చెందిన రాజేష్‌కు విక్రయించేవాడు. రాజేష్.. అరుళ్‌పురంలోని అలెక్స్‌కు చెందిన గోడౌన్‌ను అద్దెకు తీసుకుని తమిళనాడు బియ్యాన్ని డంప్ చేసుకునేవాడు. ఆపై బియ్యాన్ని బంగారుపాళ్యం, పలమనేరుల్లో అధిక రేట్లకు విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో బియ్యాన్ని అమ్ముతుండగా అరుళ్‌పురం వద్ద రాజేష్, పూర్ణలను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఆటోతోపాటు 900 కిలోల బియ్యాన్ని సీజ్ చేశారు.

'గుడిపేరుతో స్థల ఆక్రమణకు యత్నం'

చిత్తూరు రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మురకంబట్టులోని విలువైన తమ స్థలాన్ని గుడి పేరుతో కొందరు ఆక్రమించడానికి యత్నిస్తున్నారని సంధ్య అనే మహిళ ఆరోపించారు. గురువారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మురకంబట్టులోని సర్వేనెం.616/3ఈలోని 0.45 సెంట్లు, 616/3ఈ2లో ఉన్న 0.45 సెంట్లు భూమిని ఎన్నో ఏళ్లకు ముందు కొనుగోలు చేశామన్నారు. ఇప్పుడు తమ స్థలాన్ని ఆక్రమించుకుని గుడి నిర్మించాలని చూస్తున్నారని చెప్పారు. దీనిపై కలెక్టర్‌కు 'పీజీఆర్ఎస్'లోనూ ఫిర్యాదు కూడా చేశామన్నారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

డైట్‌లో ఎలక్ట్రిక్ కారుకు చార్జింగ్..!



వైరల్ అయిన ఫొటో

వెదురుకుప్పం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం డైట్‌లో ఎలక్ట్రిక్ కారుకు చార్జింగ్ పెట్టుకుని విద్యుత్‌ను వాడుకుంటున్నారని గురువారం దుమారం చెలరేగింది. ఓ లెక్చరర్ తన ఎలక్ట్రిక్ కారుకు చార్జింగ్ పెట్టుకోవడం వల్ల విద్యుత్ బిల్లుల మోత మోగుతోందని ఓ ఫొటో వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయింది. ప్రస్తుతం ఈ అంశం చర్చనీయాంశంగా మారింది.

తాగునీటి పైపులైనుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



పెనుమూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గంగుపల్లె చెరువు నుంచి మఠంపల్లె దళితవాడకు వెళ్లే పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. 'తాగునీటి వృథాను అరికట్టలేరా?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైంది. స్పందించిన సెక్రటరీ పైపులైనుకు మరమ్మతులు చేయించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి: కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్ కుమార్

పూతలపట్టు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. పూతలపట్టు సమీపాన ఉన్న వేము ఇంజనీరింగ్ కళాశాల ఆవరణంలో గురువారం జరిగిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వ్యసనాలకు బానిసలు కావొద్దని చెప్పారు. కళాశాల చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు, ప్రిన్సిపాల్ నవీన్ కిల్లారి, కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) సాయి శిరీష, హెచ్‌వోడీ శశికళ, అధ్యాపకులు పాల్గొన్నారు.